# ఇష్టమైన కష్టం

డియర్ సులోచన—

ఎలా వున్నావ్. నీకేం హాయిగా అమ్మా నాన్నల దగ్గర ఆనందంగా గడిపేస్తుంటావ్. నేనిలా వ్రాస్తే "అత్తవారింట్లో ఆరళ్ళు పడుతున్నట్లుగ తెగ బాధపడిపోతున్నావేమిటే" అని రకరకాలుగా దెప్పిపొడుస్తావ్ కదూ.

కానీ సులోచనా మనలా పెళ్ళీడువచ్చిన అమ్మాయిలు అమ్మా నాన్నల దగ్గరయినా వుండాలి, లేకపోతే అత్తవారింట్లోనయినా వుండాలి. ఆ రెండే మనకి సమంజసమైన స్థానాలనిపిస్తున్నది. ఇంక వేరేచోట ఎక్కడున్నా. వాళ్ళు మనకు ఎంత ఆత్మీయులైనా మన సుకో ఏదో వెలితిగానే వుంటుంది.

నిజం చెపున్నాను. మా అన్నయ్య, వదిన నన్ను చాలా ప్రేమగా చూసుకుంటున్నారు. నాకు ఏలోటు రాకుండా, నన్ను నొప్పించకుండా ఆత్మీయంగా వుంటున్నారు. మా అన్నయ్యకు చిన్నప్పటినుంచి నేనంటే ప్రాణం. మా వదినకూడా ఆయనకు తగిన భార్య. మా అమ్మ నాన్నలకు తగిన కోడలు. ఇలాంటి వదిన దొరికినందుకు ఎంతో సంతోషపడుతున్నాను. నిజంగా ఇది మా అందరి అదృష్టం.

మా అన్నయ్య వదినలకు నేనింకా చిన్నపిల్లనేకదా. అందుకే బజార్నుంచి ఏ వస్తువు కొనుక్కువచ్చినా ముందరగా తినిపించిగానీ

వాళ్ళు తినరు. ఇంటిముందు కొనే పూల విషయంలో కూడా వదిన నాకే ప్రాధాన్యత నిస్తుంది. అన్నింటికీ నా సలహా అడుగుతుంది. నా ఇష్టం అడిగి తెలుసుకుంటుంది. నేను అమ్మానాన్నల కోసం ఎక్కడ దిగులు పడతానోనని ఎప్పటికప్పుడు నన్ను కనిపెట్టుకుని వుంటారు అన్నయ్య, వదిన. నన్నసలు ఇంట్లోపని ముట్టుకోనివ్వదు మా వదిన. నేనే కల్పించుకుని ఏదో పని చేయడానికి ప్రయత్ని స్తుంటాను. నేనలా పనిలో జొరబడడం ఆమెకు కోపాన్ని తెప్పి స్తుంది. కాని నాకు నేనే ఆమెకు నచ్చచెప్పేను, "ఇంట్లో ఊరికినే కూర్చుంటే ఏం తోస్తుంది. నీతో కబుర్లాడుతూ కాలక్షేపంగా వుం టుందని ఏవో చిన్నచిన్న పన్లు చేస్తున్నానంతే" అంటూ ఆమెను అనునయించడం నాకు కష్టమే అయింది.

అప్పటికీ ఆమె నాకు కేటాయించిన పనులేమిటో తెల్సా. చెప్తే నవ్వుకుంటావు కూడా. ఇల్లు కసువు చిమ్మడం, నీటుగా సర్దడం, చాకలి ఉతికి తెచ్చిన బట్టలు మడతలు పెట్టడం, పూలు మాలకట్టడం.... ఇవీ ఆవిడ నాకు అప్పగించిన పనులు. "ఇంతకు మించి మరో పనిజోలికి వెళ్తేమాత్రం ఊరుకోను" అంటూ హెచ్చ రించింది. నాతో మాట్లాడనని బెదిరించింది కూడా. ఇంత మంచి వదిన ఎంతమందికి దొరుకుతుందంటావు సులోచనా ?

పని విషయం వచ్చినప్పుడల్లా ఆమె ఏమంటుందో తెల్సా.... ఆడపిల్లలు అన్ని పనులు నేర్చుకుని మాత్రం వుండాలిటగాని పెళ్ళి అయ్యేవరకు ఇంట్లో పని చేసి చేసి అలసిపోయి, విసిగిపోయి ఉండ కూడదట. అలా పుట్టింట్లో ఇంటెడు చాకిరీ చేసిచేసి విసిగి వేసారి తమ ఇష్టాఇష్టాల్తో నిమిత్తం లేకుండా ఓ మగాడ్ని అంటిపెట్టుకుని

అత్తారింటికి వెళ్తే అక్కడకూడా అదే పాత జీవితం ప్రారంభం అవుతుందట. నూతనత్వం ఏమీ కనిపించదట. అలాంటప్పుడే జీవితం అంటేనూ. పెళ్ళంటేను, మొగుడంటేనూ విసుగేస్తుందట. ఆవిసుగు లోనించేనట సమానత్వం, ఒంటరిగా సినిమాలు, షికార్లు ఎందుకు చేయకూడదనే ఆలోచన్లు వచ్చేది. అలా కాకుండా పనుల్తో విసిగిపోకుండా పెళ్ళయివెళ్ళిన ఆడపిల్లలకు ఇంటిపనులు చేసుకోవడంలో, భర్తకు వండిపెట్టడంలోనూ ప్రతి పనిలో ఏదో తీయని అనుభూతి, తృప్తి కలుగుతాయట. ఎంత బాగా చెప్పిందో కదూ. నిజంగా ఆమె ఆలోచన నాకెంతగానో నచ్చింది. అందుకేనట ఆమె నన్ను పనుల జోలికి పోవద్దనేది.

అవునుగానీ సులోచనా వదిన మాటల్ని మన పెద్దవాళ్ళతో అంటే వాళ్ళేమంటారంటావ్ ?

ఏమంటారు .. పనిపాట లేకుండా కూర్చుని, వండిపెడుతుంటే తీరిగ్గా తినడం మరిగితే బద్ధకం బాగా పెరిగిపోయి... అంటూ మొదలుపెట్టి ఓ గంటసేపు మనల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోస్తారుకదూ !

వాళ్ళు చెప్పేది నిజమేనేమో ననిపిస్తుంది కానీ .... ఏమో నా ఓటుమాత్రం మా వదినకే.

అన్నయ్య, వదిన సినిమాలకు వెళ్తూ నన్నుకూడా రమ్మనమని ఎంతో బలవంతం చేస్తారు. ఇక్కడకు వచ్చిన కొత్తల్లో రెండు మూడుసార్లు మాత్రం వెళ్ళాను. అటుతర్వాత మాత్రం నేను వెళ్ళ లేదు బాబు.

ఆ ఇద్దరి ఏకాంతానికి నేను అవరోధంగా వుంటున్నానన్న ఆలోచనలు అడుగడుగునా నన్ను వేధిస్తున్నాయ్. వెక్కిరిస్తున్నాయ్. వాళ్ళు నన్ను ఎంత ప్రేమగా చూసుకుంటున్నప్పటికీ ఈ భావన నన్ను వాళ్ళకి దూరంగా వుండేటట్లు చేస్తున్నది సులోచనా. ఇలాంటి కష్టాన్ని నీలాంటి మనసెరిగిన స్నేహితుల్తో కాక మరెవర్తో చెప్పుకుంటాం చెప్పు. అందుకే నీకు వ్రాస్తున్నాను. ఆత్మీయుల మధ్యన వుంటూ ఇలాంటి ఇబ్బందులు పడటం బహు విచిత్రంగా ఉంటుంది కదూ.

టీ. వీ చూసేటప్పుడు, రేడియోలో పాటలు వినేటప్పుడు అన్నయ్య. వదిన మౌనంగా కళ్ళతో ఆడుకునే సరసం యాదృచ్ఛికంగా నాకంట పడినప్పుడు పాపం వాళ్ళిద్దరూ ఎంత సిగ్గుపడుతుంటారో, వారికంటే రెట్టింపు సిగ్గుపడటం తప్ప నేనేం చేయగలను. అక్కడనుంచి నేను వెళ్ళిపోయేటంతలో వదినే వడివడిగా వంటగదిలోకి వెళ్తుంది. మామూలుగా అయితే అన్నయ్యే ఆమెను అనుసరించేవాడేమో సరసాలాడ్డానికి, నేనున్నాకదా ఈడొచ్చిన పిల్లను, అందులోనూ సొంత చెల్లెల్ని కూడా.

అలాంటప్పుడు అసందర్భంగా నాతో మాటల్లోకి దిగే అన్నయ్య ముఖంచూస్తే జాలేస్తుంది, నవ్వూ వస్తుంది. అంతేకాదు నామీద నాక్కోపంకూడా వస్తుంది.

వీటన్నిటిమధ్యా "అమ్మాయికి సంబంధా లెక్కడయినా విచారిస్తున్నావా" అంటూ అప్పుడప్పుడు నాన్నగారి దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాలు. ఆ ఉత్తరం వచ్చినప్పుడల్లా అన్నయ్య ముఖంలో కనిపించే అసహాయత, అసహనం నన్ను కలవరపరుస్తుంటాయ్.

ఇల్లు మరింత చిన్నది కావడంతో నా మూలంగా వాళ్ళు మనసారా ముచ్చటగా సరసాలాడుకోవడానికి అవకాశం లేకుండా పోయింది సులోచనా. నా, ఈ పరిస్థితికి నాకే సిగ్గుగానూ ఉన్నది, బాధగానూ ఉన్నది.

అమ్మకు నాన్నకు ఈ విషయాలు నీకు తెలియజేసినంత సులభంగా ఎలా చెప్పను ? అయినా ఈ మాత్రం ఆలోచన వాళ్ళకు మాత్రం ఉండదా ?

కానీ పాపం నాన్నగారు మాత్రం ఏంచేస్తారు ? ఆయనకు శక్తి వున్నంతవరకు సంపాయించారు. పిల్లలకు చదువులు చెప్పించారు. నా అదృష్టం బాగుండి చదువు అబ్బింది. డిగ్రీ పూర్తిచేయ గలిగాను.

'నన్ను తనతో పంపమని - ఏదైనా ఉద్యోగంలో చేర్పిస్తానని' అన్నయ్య తనకుతానే అడిగాడు నాన్నగారిని.

నన్ను విడిచివుండటం ఇష్టం లేకపోయినా, అన్నయ్య మనస్సు నొప్పించడం ఇష్టంలేక అర్ధాంగీకారంగా మౌనం వహించింది అమ్మ.

ఆడపిల్లల పెళ్ళిళ్ళకోసం అని ఎంత ఇబ్బందివచ్చినా కదల్చకుండా వుంచిన కాస్త సొమ్మూ కూర్చుని తినటానికే అయిపోతుందేమోనన్న దిగులు ఎక్కువయింది నాన్నగారికి. అందుకే ఆయనకి వచ్చే పింఛను డబ్బుకు తోడుగా నేను కొంత సంపాయిస్తే ఆయనకు ఆర్థికంగా కొంత ఆసరాగా వుంటుందని ఆలోచించారు ఆయన.

పడుచు జంటకు అడ్డుగా వున్నాననే నా బాధ వినేవాళ్ళకు తేలిగ్గానే వుంటుంది కానీ మనలాంటి ఆడపిల్లలకు మాత్రం చాలా కష్టంగా వుంటుంది సులోచన. అనుభవంలోకి వస్తేగాని తెలిసిరాదు ఎవ్వరికైనా.

అయినప్పటికీ మా వదిన మంచితనం, ఆత్మీయతలవల్ల నా, ఈ కష్టాన్ని ఇష్టమైన కష్టంగా మార్చుకున్నాను.

నీ లెటర్‌కోసం ఎదురుచూస్తూ....

నీ

సుచరిత

"ఇదిగో అట్లా కనిపించిన అడ్డమైన కాగితాలు పుస్తకాలు చదువుకుంటూ చతికిలబడి కూర్చుంటే పనంతా ఎవరు చేస్తారూ. త్వరగా వచ్చి ఆ గిన్నెలు కడుక్కురా. లేచి తగలడు" వదినగారి మందలింపుతో వులిక్కిపడిన సులోచన స్నేహితురాలి ఉత్తరాన్ని దాచేసి పనికి ఉపక్రమించింది.

అమ్మనాన్నలు లేని సులోచన ఆ మూడుముళ్ళూ పడేవరకూ అన్నయ్య ఇంట్లో వుండక తప్పని పరిస్థితుల్లో అన్ని కష్టాల్ని ఇష్టాలుగా మార్చుకున్నది పాపం.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 19-9-91)